కష్టజీవులను ఐక్యం చేసిన కార్ల్ మార్క్స్ సిద్ధాంతం



2 లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 06 | మే | 2025
పేజీలు 8

# పేదల పక్షాన పోరాడిన వెంపటి



**-సిపిఐ విస్తరణలో కీలక భూమిక**
**-వెంపటి సూర్యనారాయణ సంస్మరణ సభలో కూనంనేని**



**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు పేదల పక్షాన పోరాడడంతో పాటు అనేక మందిని పోరాటాల వైపు నడిపిన వెంపటి సూర్యనారాయణ ధన్యజీవని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణలో సూర్యనారాయణ కీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. వెంపటి సూర్యనారాయణ సంస్మరణ సభ సోమవారం పాల్వంచలోని తనూజ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో కూనంనేని మాట్లాడుతూ సూర్యనారాయణతో తనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవని తన ఎదుగుదలలో ఆయన అందించిన సహకారం మరువ లేనిదన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం జెండాలు, ఎజెండాలు మారుస్తూ

మిగతా 2లో..

# విజ్ఞానం అందించేందుకు రైతు వద్దకు శాస్త్రవేత్తలు



**-మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేస్తే మేలు**
**-వ్యవసాయ అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం**
**-రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రైతులకు విజ్ఞానం అందించేందుకు ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం రాంక్యాతండా రైతు వేదికలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆహార సంక్షోభం నుంచి బయటపడేందుకు మనం హరితవిప్లవం ప్రారంభించామని నేడు మనకు కావాల్సిన ఆహార ఉత్పత్తుల తయారీలో స్వాలంభన సాధించామన్నారు. ప్రస్తుతం రైతులకు దిగుబడి పెరిగినా లాభసాటి కావడం లేదని, రసాయనాల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతీంటుందన్నారు. దేశంలో ఉన్న విజ్ఞానం రైతుల వద్దకు తీసుకుని

మిగతా 2లో..

# సారూ.. చలివేంద్రాల సంగతేంటి..?

## చలివేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వేసవిలో ప్రజలు త్రాగు నీటి ఇబ్బందులు పడరాదని ఖమ్మం కార్పోరేషన్ పాలక వర్గం 60 డివిజన్లలో జన సంచార ప్రాంతాల్లో మొత్తం 70కు పైగా చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణకు ఒక్కో చలివేంద్రానికి సుమారు రూ. 16వేలు సమకూర్చినట్లు సమాచారం. ఇంత ఖర్చు చేస్తున్నా చలివేంద్రాల ద్వారా ప్రజలకు చుక్కనీరు అందిన దాఖలాలు లేవు. పలు చలివేంద్రాల్లో ఖాళీ కుండలు దర్శనమిస్తూ కుక్కలకు ఆవాసంగా మారాయి. చలివేంద్రాలకు సంబంధించి

మిగతా 2లో..

# ప్రతి రైతుకు గుర్తింపు కార్డు



**-11 అంకెలతో ప్రత్యేక నెంబర్ కేటాయింపు**
**-ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**

6లో..

# మెడికల్ షాపుల రూటే సప‘రేటు’..!

**-డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు**
**-సర్టిఫికెట్లు అద్దెకు తెచ్చి మరీ షాపుల నిర్వహణ**
**-కనిపించని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు**

సెంటర్ స్ప్రెడ్



# విజ్ఞానం అందించేందుకు రైతు వద్దకు శాస్త్రవేత్తలు

(మొదటిపేజీ తరువాయి)



వచ్చేందుకు ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మన నేల, రకం, స్వభావం అనుగుణంగా ఎరువులు, రసాయనాలు అవసరం మేరకు మాత్రమే వాడాలని కలెక్టర్ తెలిపారు. మనం పంట వేసే ముందు ఎరువులు, రసాయనాలు ఎంత వేయాలో తెలుసుకుని అంతే వేయాలన్నారు. మన దగ్గర ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలన్నారు. రైతులు పంటల మార్పిడి విధానం అమలు చేయాలన్నారు. చిన్న, సన్నకారు రైతులు కాకుండా ఐదు, పది ఎకరాలు ఉన్న రైతులు ముందుకు వచ్చి వారు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలన్నారు. ఒక రైతుకు మరో రైతును చూసి మాత్రమే నమ్మకం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఖమ్మంజిల్లాలో ఏడు లక్షల ఎకరాల పంట పొలాలు ఉంటే నేడు వరి, పత్తి, మొక్కజొన్న మూడు పంటలు 90 శాతానికి పైగా రైతులు సాగు చేస్తున్నారన్నారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్బైడ్ రహిత మామిడి పండిస్తే డిమాండ్ ఉందని గమనించి రైతు ఆ దిశగా సాగు చేస్తే మంచి విలువతో విక్రయించవచ్చునన్నారు. రైతులకు లాభం పెరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దళారులు లేకుండా రైతులు నేరుగా అమ్ముకునేలా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు ఒకసారి చర్చించుకుని మంచి ప్రయత్నం చేయాలని ప్రభుత్వం తరుపున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అనంతరం మండలంలో నూతన సాగును ప్రోత్సహిస్తున్న రైతులను కలెక్టర్ సన్మానించారు. జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య మాట్లాడుతూ రైతులు యూరియా వినియోగం అధికంగా చేస్తున్నారని దీని వల్ల పంట పొలాలు చౌడుబారి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. మోతాదుకు మించి యూరియాను వాడకూడదని ఆయన తెలిపారు. విత్తనాలు, పురుగు మందుల రశీదు రైతులు పంట కాలానికి మొత్తం భద్రపర్చుకోవాలన్నారు. వైరా కెవికె శాస్త్రవేత్త రవికుమార్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సూచించినటువంటి ఆరు అంశాలపై సలహాలు, సూచనలు అందించారు. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించాలని, అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలనే అంశాల మీద రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఎంపిడివో అశోక్‌కుమార్, ఖమ్మం డివిజన్ ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రైతు సంఘం అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు మందడపు సుధాకర్, తాతా రఘురాం, డివిజన్ ఉద్యానవన అధికారి నగేష్, ఏఈవోలు ప్రతిభ, వేదవ్యాస్, శివ, వెంకటేష్, శిరణ్మయి, పంచాయతీ సెక్రటరీ లాలయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడిన వెంపటి

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాలను మలినం చేస్తున్న ప్రస్తుత తరుణంలో తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి సుదీర్ఘకాలం ప్రజా ఉద్యమాల్లో పని చేసిన ఘనత సూర్యనారాయణకు దక్కుతుందన్నారు. సూర్య నారాయణ ఆశించిన విధంగా కమ్యూనిస్టు పార్టీని మరింత మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. ప్రజలను పోరాటాలకు సమాయత్తం చేయడం కమ్యూనిస్టు పార్టీని విస్తరించడమే సూర్యనారాయణకు ఇచ్చే సరైన నివాళి అని సాంబశివరావు తెలిపారు. అమరులు చేసిన త్యాగాలను నిరంతరం గుర్తుచేసుకుంటూ వారు చూపిన బాటలో ప్రజలను పోరాటాలకు సమాయత్తం చేయాలని సాంబశివరావు పిలుపు నిచ్చారు. సూర్యనారాయణ మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ఆయన తెలిపారు. ఈ సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, ఉమ్మడిజిల్లా సిపిఐ నాయకులు యర్రాబాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, భూక్యా శ్రీనివాస్, డి. సుధాకర్, వి. పద్మజ, రత్నకుమారి, కొండలరావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సారూ.. చలివేంద్రాల సంగతేంటి..?

(మొదటిపేజీ తరువాయి)

పందిళ్లు ఏర్పాటు చేసి దానిలో నాలుగు నుంచి ఐదు మట్టి కుండలు ఏర్పాటు చేశారు. కుండల్లో నీరు పోసేవారు కానీ అక్కడ ఉండి ప్రయాణికులకు నీరు అందించే వారు కానీ లేరు. దీనితో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోయింది. దీనిపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నా అధికార యంత్రాంగం దీని గురించి పట్టించుకున్న నాధుడే లేడు. ఇప్పటికైనా కార్పోరేషన్ అధికారులు వెంటనే చలివేంద్రాల ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

**కూలినా పట్టించుకోరా : సిపిఐ**

ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు కూలిపోతున్న అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం లేదని సిపిఐ నగర సమితి ఆరోపించింది. 19వ డివిజన్‌లో కొత్తగూడెం అల్లిపురం క్రాస్‌రోడ్డు ఐటి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం సిపిఐ నాయకులు పరిశీలించారు. చలివేంద్రం ద్వారా చుక్కనీరు అందించిన పాపాన పోలేదని ఇప్పటికైనా కూలిపోయిన చలివేంద్రాన్ని మరమ్మతు చేసి ప్రతి చలివేంద్రంలోనూ ఒకరిని ఉంచి త్రాగునీటిని అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ నేతలు కోరారు. చలివేంద్రాన్ని పరిశీలించిన వారిలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, నాయకులు వరద నర్సింహారావు, మాలకొండయ్య, మాడుగుల నాగేశ్వరరావు, సిద్ధి శ్రీనివాసరావు, సామేలు, శీలం నాగేశ్వరరావు, రామకృష్ణ, మెంటెం రవి, శ్రీరాం దుర్గ పాల్గొన్నారు.

# కష్టజీవులను ఐక్యం చేసిన కార్ల్ మార్క్స్ సిద్ధాంతం

-మార్క్సిజమే ప్రపంచ మానవాళికి దిక్సూచి
-అన్యాయం, అవినీతి, దోపిడి నిర్మూళన మార్క్సిజంతోనే సాధ్యం
-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
-సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కార్ల్ మార్క్స్ 207వ జయంతి

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పెట్టుబడి దారులకు సాగిస్తున్న దోపిడికి వ్యతిరేకంగా కార్మికులు, కష్టజీవులను ఏకం చేసే సిద్ధాంతాన్ని రూపకల్పన చేసి, మానవ శ్రమకు విలువ చేకూర్చిన మహామేధావి కార్ల్ మార్క్స్ అని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మార్క్స్ 207వ జయంతిని పురస్కరించుకొని శేషగిరిభవన్లో సోమవారం మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, మానవ శ్రమకు విలువ లేని పరిస్థితుల్లో శ్రామిక జీవులకు పని గంటలు,శ్రమకు తగిన వేతనం కోసం ఆయన చేసిన కృషి ప్రపంచ కార్మిక వర్గానికి తోడ్పాటును అందించిందన్నారు. సమాజ చరిత్ర అంతా వర్గపోరుతోనే ముడిపడి ఉంటుందని, ఈ వర్గపోరే అంతిమ విజయం సాధిస్తుందని చెప్పిన మహా మేధావి, మానవతావాది మార్క్స్ అని కొనియాడారు. మార్క్సిజం ప్రపంచ మానవాళికి దిక్సూచి వంటిదని, అన్యాయం, దోపిడి, అవినీతి నిర్మూలించబడాలంటే మార్క్సిజానికి అనుగుణంగా ప్రజలు నడుచుకోవాలని సూచించారు. కమ్యూనిస్టు పార్టీలకు కలం చెల్లిందన్న వారికి చైనా విప్లవం సరైన సమాధానం చెప్పిందని, చైనా, క్యూబా, వియత్నాం వంటి దేశాలు సోసలిస్టు మార్గంలో ముందుకు పోతున్నాయన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంత కర్తగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మార్క్స్ అడుగు జాడల్లో నేటితరం కమ్యూనిస్టులు నడుచుకోవాలని, తద్వారా కమ్యూనిజాన్ని మరింతగా విస్తరింపచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరిమి రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస రావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, ఎస్ కె ఫహీమ్, నూనావత్ గోవిందు, గుత్తుల శ్రీనివాస్, దారా శ్రీనివాస్, గౌని మని, సురేష్, లక్ష్మీ నారాయణ ధనలక్ష్మి, దార లక్ష్మి, అక్తర్, శాంతి పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట కేంద్రంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న ద్విచక్రవాహనాల చోరీల నేపథ్యంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా అంతరాష్ట్ర మోటార్ సైకిళ్ళ దొంగలను దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సిఐ నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ముత్యాల గణేష్ సోమవారం అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ ఎస్సై అఖిల తన సిబ్బందితో భద్రాచలం రోడ్డులో హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాల తనిఖీల్లో భాగంగా అశ్వారావుపేటలో దొంగలించిన మోటార్ సైకిళ్లతో పరారీ అవుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితున్ని విచారించగా 10 ద్విచక్రవాహనాలు దొంగతం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 3, దమ్మపేట పరిధిలో 1, పక్క రాష్ట్రం ఏపిలోని తడికలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 బైకులను దొంగతం చేసినట్లు తెలిపారు. గణేష్ మద్యానికి, జల్సాలకు బానిసై వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గత 6 నెలల నుండి మోటార్‌సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని నిందితున్ని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై యయాతిరాజు, అఖిల, హెడ్ కానిస్టేబుల్స్ నాగేంద్రరావు, వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# డిప్యూటీ సిఎం భట్టిని కలిసిన ఎమ్మెల్యే జారె



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను హైదరాబాద్‌లోని తన ఛాంబర్లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఆర్‌ఓఎఫ్ ఆర్ పట్టాలు మంజూరైే పోడుభూములను సస్యశ్యామలం చేయాలనే దృఢ సంకల్పంతో నూరుశాతం సబ్సిడీతో సోలార్విద్యుత్ బోర్లు, మోటార్లు ఇస్తున్న తరుణంగా చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందుకు డిప్యూటీ సిఎం భట్టికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కావడిగుండ్ల, అశ్వారావుపేట, అచ్యుతాపురం, తిరుమలకుంట, పార్కులగండి గ్రామాల్లో నూతనంగా మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ల శంకుస్థాపనలకు, పైలెట్ ప్రాజెక్టు బెండాలపాడు గ్రామంలో బోర్ల ప్రారంభోత్సవాలకు విచ్చేయాలని భట్టికి ఆహ్వానపత్రికను అందచేశారు.

# 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొనాలి

-సింగరేణి జిఎం పర్సనల్‌కు స్ట్రైక్ నోటీసు ఇచ్చిన ఏఐటీయూసీ నాయకులు



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కార్మిక చట్టాల స్థానంలో అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించి వేసే లేబర్‌కోడ్ లను నిలిపివేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పని గంటలను పెంచాలని కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న ఒక్కరోజు సమ్మెలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నాడు సింగరేణి కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో జనరల్ మేనేజర్ పర్సనల్ కవిత నాయుడు కు స్ట్రైక్ నోటీస్ ను నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హక్కులను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అప్పటివరకు ఐ పవర్ కమిటీ వేతనాలు లేదా రాష్ట్ర ప్రభుత్వం కొత్త జీవోలను విడుదల చేసి తక్షణమే వేతనాలను పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఖాలి క్వార్ టర్స్ ను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని, తక్షణమే ఈఎస్ఐను అమలు చేయాలని, చేస్తున్న పని ఆధారంగా హైలీ స్కిల్డ్, స్కిల్డ్,సెమి స్కిల్డ్ వేతనాలను చెల్లించాలని, సీఎంపిఎఫ్ పాసుబుక్కులను అప్డేట్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పిట్టల రామచందర్, కె.నరసింహారావు, గుర్రం శ్రీను, సిహెచ్ శ్రీను, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆనాటి జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే..

-ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం
-అలరించిన పూర్వ విద్యార్థుల నృత్యాలు



**ప్రజాపక్షం/పినపాక:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు చారి, ఉప్పలయ్య, కుద్దుస్, ఇంద్రసేనారెడ్డి, ఇందిరా, పాల్గొని లను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి జ్ఞాపకాలను విద్యార్థులతో ఉపాధ్యాయులు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంట రవీందర్‌రెడ్డి, భద్రయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, విజయభాస్కర్, సర్వేష్, రాము, రమేష్, సురేష్, బ్రుహస్పతి, దొడ్డి శ్రీనివాస్, రామకృష్ణ, భాస్కర్, నారాయణ, రేణుక, యూసోఫ్, మాధవి, వెంకటరమణ, సరళ, నాగలక్ష్మి, భాగ్యశ్రీ, జ్యోతి, లక్ష్మమ్మ, వెంకటరమణ, కృష్ణకుమారి, సరళ, వెంకటరమణ, జ్యోతి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రఘునాథపాలెం మండలంకు చెందిన సిహెచ్ కార్తీక్ శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల పాన్నెకల్‌లో 2023 24 విద్యా సంవత్సరంలో సిఎస్ఈ బ్రాంచ్ నందు చేరానని అనివార్య కారణాల వల్ల చదువు ఆపేసినప్పటికీ నా సర్టిఫికెట్లు ఇవ్వకుండా నాలుగేళ్ల ఫీజు తీసుకు రమ్మంటున్నారని తన సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుదిమళ్ల గ్రామానికి చెందిన కె. శైలజ తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం అర్బన్ రామన్నపేటకు చెందిన ఎస్‌కె నాగులమీరా తనకు బ్యాడ్జి లైసెన్స్, హెవీ లైసెన్స్ ఉన్నాయని ఏదైనా ప్రభుత్వకార్యాలయంలో డ్రైవర్ ఉద్యోగం ఇప్పించాలని దరఖాస్తు చేశారు. వెలుగుమట్ల రెవెన్యూ గొల్లగూడెం గ్రామస్తులు తమ గ్రామంలో హిందూ స్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు.ఆయా దరఖాస్తులను పరిశీలించి సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**- సిపిఐ గ్రామ మహాసభలో జిల్లా సహాయ కార్యదర్శి దండి**




**ప్రజాపక్షం/ మధిర :** భారతదేశంలో మహోజ్వల పోరాట చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం సిపిఐ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. మధిర మున్సిపాల్టీ పరిధి మడుపల్లి గ్రామంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు అధ్యక్షతన సిపిఐ గ్రామ శాఖ మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన దండి సురేష్ మాట్లాడుతూ నిరంతరం కార్మిక, కర్షక, పేద,బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి దోపిడిలేని వర్గ రహిత సమాజ నిర్మాణం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా పనిచేస్తుందని అన్నారు. దేశ రాజకీయ వ్యవస్థలో ప్రజల కోసం పనిచేసే పార్టీగా సిపిఐ కీర్తించబడుతుందని, దేశం కోసం, దేశంలోని అన్ని వర్గాల ప్రజల కోసం నిరంతరం ఆలోచిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యంగ రక్షణ, మానవ హాక్కుల కోసం పోరాడుతున్న పార్టీ సిపిఐ అని కొనియాడారు. దేశంలో పాలకులు ఎందరు మారినా ఒక్క ప్రజల పక్షాన నిలిచే పార్టీగా సిపిఐకి పేరుందని, అలాంటి పార్టీని బలోపేతం చేయడం కోసం శ్రేణులంతా పట్టుదలతో కృషి చేయాలన్నారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో సర్పంచ్‌లు, ఎంపిటిసి స్థానాలతో పాటు మున్సిపాల్టీ కౌన్సిలర్లు, ఎంపిపి స్థానాలు గెలుపొందడమే లక్ష్యంగా కార్యచరణ సిద్ధం చేసుకోవాలని, అందుకు నిత్యం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి గత వైభవాన్ని పార్టీకి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మడుపల్లి సిపిఐ గ్రామశాఖ కార్యదర్శిగా జల్లా బ్రహ్మం ఎన్నిక కాగా గ్రామశాఖ సహాయ కార్యదర్శులుగా అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ ఎన్నికయ్యారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మందడపు రాణి, సింగ్ నర్సింహారావు, సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, ఎంఎ రహీం, పంగా శేషగిరిరావు, తలారి రమేష్, గ్రామశాఖ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సెలూన్లను మూసివేయాలి

**-నాయీ బ్రాహ్మణులకు రాయితీపై రుణాలివ్వాలి**

**-అంబేడ్కర్‌కు వినతి**






**ప్రజాపక్షం/ఖమ్మం :** తమ జీవనోపాధిని దెబ్బతీస్తున్న కార్పోరేట్ సెలూన్లను వెంటనే మూసివేయాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్ చేసింది. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. అంతకు ముందు పెవిలియన్ మైదానం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించి అంబేద్కర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుండ్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సంఘం అధ్యక్షులు యలమందల జగదీష్ మాట్లాడుతూ వేలాది మంది నాయీ బ్రాహ్మణులు శతాబ్దాల నుంచి కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కార్పోరేట్ సెలూన్ల కారణంగా జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణ కులవృత్తిని కాపాడేందుకు పాలకులు సహకరించాలని జగదీష్ విజ్ఞప్తి చేశారు. వృత్తిదారులకు రాయితీపై రుణాలు ఇవ్వాలని రూ. 10లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు తమకు అండగా ఉన్నాయని ప్రభుత్వం ఆలోచించాలని జగదీష్ విజ్ఞప్తి చేశారు. కార్పోరేట్ సెల్లూన్లు మూసివేసేంత వరకు వివిధ రూపాల్లో తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. సిపిఐ నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు చేస్తున్న ఆందోళనకు తాము పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. భవిష్యత్తులో కార్పోరేట్ సెల్లూన్ల మూసివేత వరకు సిపిఐ నాయీ బ్రాహ్మణులకు దన్నుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు, కొత్తగుండ్ల శ్రీలక్ష్మి, రావుల హన్మంతరావు, డాక్టర్ దయానంద్, శీలం పాపారావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, ఆవుల అశోక్, కొత్తపల్లి రవి తదితరులు పాల్గొన్నారు. ఆందోళన అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

# కామేపల్లిలో శివాలయం నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లిలో ఈనెల 8న ఉదయం 7:30కు శ్రీ బాల త్రిపుర సుందరి సమేత సపంచాయతన సహిత ఇష్టకామేశ్వర స్వామి దేవాలయ జీర్ణోద్ధరణము, శ్రీ గురు హరి హర మహాక్షేత్రం దేవాలయం(శివాలయం) నిర్మాణానికి శంకుస్థాపన వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ గొట్టుపర్తి శివాజీ తెలిపారు. శనివారం కామేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరమ పూజ్య సద్గురు శ్రీశ్రీశ్రీ అవధూతేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య అనుగ్రహంతో, శ్రీ కాళీ వనాశ్రమ పీఠాధిపతులు పూజ్య శ్రీ చంద్రకాళీ ప్రసాద్ మాతాజీ వారి దివ్య ఆశీస్సులతో ఈ వేడుకలలో భక్తులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధి బృందం దమ్మలపాటి శివాజీ, కోటగిరి రాము, మహంకాళి రామ నర్సయ్య, అంతోటి అచ్చయ్య, భూక్యా శ్రీను నాయక్, అజ్మీర హరి నాయక్, జరపల రామారావు, అజ్మీర రాందాస్, అజ్మీర అర్జున్ నాయక్, కొర్ర రాములు, దీవెల నరసయ్య, భూక్యా సీతారాములు, కేశగాని నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతంగా ఆలోచించి లక్ష్యాలను అధిరోహించాలి

**-స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించి విద్యతో పాటు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఖమ్మంజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఇటీవల విడుదలైన పది పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన భువనశ్రీ, శిరీష, శ్రీజ లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం కలిశారు. డా॥ బిఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థలో తాము సభ్యత్వం పొందామని తమను విష్ చేయండి, బ్లెస్ చేయండి, గైడ్ చేయండి మీరే మాకు రోల్ మోడల్ అంటూ జిల్లా కలెక్టర్‌తో విద్యార్థులు సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ కొద్దిసేపు ముచ్చటించారు. భవిష్యత్తులో వారు ఏమి కావాలనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎంతో శ్రమిస్తే మీరు ఈ స్థాయికి వచ్చారని, ప్రస్తుతం విద్యలో వెనకబడిన విద్యార్థులకు మేళకువలను నేర్పుతూ ఐదుగురు విద్యార్థులను చైతన్యవంతులను చేసి మరల తన వద్దకు ఆ ఐదుగురు విద్యార్థులతో రావాలని వారికి సూచించారు. అడిషనల్ కలెక్టర్ డా॥ పి.శ్రీజను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. మీరు కన్న కలలను సాకారం చేసుకునేందుకు శ్రమించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాధిక్ అలీ ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించిన విద్యార్థులను శాలువతో సత్కరించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక పాలేరు నియోజకవర్గ బాధ్యులు డా॥ నజీర్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని, ఏదులాపురంకు చెందిన బుడిగం వెంకటేశ్వర్లుకు రూ.38వేల విలువగల సీఎంఆర్‌ఎఫ్‌చెక్కును స్థానికి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్‌క్రాస్‌రోడ్డులోని సిపిఐ కార్యాలయం వద్ద లబ్ధిదారుడికి సోమవారం అందజేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ..ఆసుపత్రి వైద్య ఖర్చుల కోసం సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సిఫారస్ ద్వారా మంజూరయ్యింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్, వెంపటి రాము, మేళ్లచెర్వు రవి, నారపొంగు యాకూబ్, యువజన సంఘం సభ్యులు మిరియాల నరుణ్‌తేజ్, పొన్నెకంటి రమేష్, రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు కీలకం




**ప్రజాపక్షం/ మధిర :** నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు ఎంతో కీలకమని మధిర టౌన్ ఎస్‌హెచ్‌ఓ, ట్రైనీ ఐపిఎస్ కొట్టే రుత్విక్‌సాయి అన్నారు. సోమవారం టౌన్ పోలీస్‌స్టేషన్ నందు పట్టణంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దొంగతనాలు, ర్యాష్ డ్రైవింగ్, యాక్సిడెంట్ కేసుల్లో సిసి కెమెరాలు ఎంతో అవసరమని, అడిషనల్ కలెక్టర్ శ్రీజ ప్రత్యేక చొరవతో మున్సిపాల్టీ నిధులు రూ.4.30లక్షలతో పట్టణంలోని బస్టాండ్, ఆర్వీ కాంప్లెక్స్, ట్యాంక్ బండ్, శాంతిథియేటర్, వైఎస్సార్ సర్కిల్, రెడ్డి గార్డెన్, అంబేద్కర్ సెంటర్, రాయపట్నం సెంటర్, లడకబజార్, ఆత్కూరు క్రాస్ రోడ్డు, నందిగామ క్రాస్ రోడ్డు, శివాలయం రోడ్డు వద్ద కొత్త టెక్నాలజీ కలిగిన 44 ఎఎన్‌పిఆర్ సిసి కెమెరాలను ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. సిసి కెమెరాల ఏర్పాటుతో ప్రజలకు భద్రత కల్పించటంతో పాటు, నేరాలు నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టౌన్ ఎస్సై వాకా చంద్రశేఖర్‌రావు, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

**ప్రజాపక్షం/కామేపల్లి:** పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ పథకమని ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కామేపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజలందరికీ న్యాయం జరిగే విధంగా పరిపాలన ఉంటుందన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సీఎంఆర్‌ఎఫ్ లబ్దిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల పాటు అసమర్థత పాలన సాగించిన బిఆర్ఎస్

**రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బీఆర్ఎస్ పదేళ్ల పాటు అసమర్థత పాలన సాగించిందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. మండలం లోని కోరట్లగూడెం లో కాంగ్రెస్ సేవా దళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు నివాసంలో సన్న బియ్యం తో అందరితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అభివృద్ధి సంక్షేమం దృష్టిలో ఉంచుకుని ప్రజాపాలన నడుస్తుందని అన్నారు. పదేళ్ల పాటు అసమర్థత పాలన సాగించిన బీఆర్ఎస్ విమర్శించటం హస్యస్పదంగా ఉందని అన్నారు. ఇప్పుడు ఉన్నది పేదల ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్నింటిని అమలు చేస్తుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ. కేంద ్రంసహకరించకపోయిన కోట్లాది రూపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కోటి మందికి సన్న బియ్యం ఇస్తున్నామని అన్నారు. రేషన్కార్డులను త్వరలోనే అందిస్తామని అన్నారు. గత ప్రభుత్వం కు కను విప్పు కలిగేలా ఇందిరమ్మ పాలన ఉంటుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడ్డారు...ఎన్నికలలో చెప్పిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రతిపక్షాలుచేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. 16 నెలలోనే అనితర సాధ్యమైన పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాయల నాగేశ్వరరావు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, హనుమంతరావు, జెర్రిపోతుల సత్యనారాయణ, మార్తి కోటి, గట్టిగుండ్ల విజయ్, కడియాల నరేష్, కణతాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# మే 16 వరకు బోనకల్ మండలంలో రెవెన్యూ సదస్సు

**-రెండు బృందాలతో 22 గ్రామాల్లో సదస్సులు**
**-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పైలెట్ ప్రాజెక్టు క్రింద జిల్లాలోని బోనకల్ మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు మే 16 వరకు నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మంజిల్లాలోని బోనకల్ మండలంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించిందని అదనపు కలెక్టర్ తెలిపారు. మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి 22 గ్రామ పంచాయతీల్లో ఒక రోజు చొప్పున ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెవెన్యూ సదస్సులు జరిగేలా షెడ్యూల్ రూపొందించడం జరిగిందన్నారు. బోనకల్ తహసీల్దార్ ఎ. పూర్ణచందర్‌రావు ఆధ్వర్యంలో టీమ్ 1, మే ఐదున గార్లపాడులో రెవెన్యూ సదస్సు నిర్వహించగా మే ఆరున తూటికుంట్ల, మేఏడున రామాపురం, మే ఎనిమిదిన బోనకల్, మే తొమ్మిదిన చొప్పకట్లపాలెం, మే 10న చిరునోముల, మే 11న ఎల్. గోవిందాపురం, మే 12న లక్ష్మి పురం, మే 13న రావినూతల, మే 14న ముష్టికుంట్ల, మే 15న ఆళ్లపాడు, మే 16న గోవిందాపురం ఎ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. మధిర తహసీల్దార్ ఆర్. రాంబాబు ఆధ్వర్యంలో టీమ్ 2, మే ఆరున సీతానగరం, మే ఏడున జానకిపురం, మే ఎనిమిదిన పెద్దబీరవల్లి, మే తొమ్మిదిన నారాయణపురం, మే 10న మోటమర్రి, మే 11న కలకోట, మే 12న రాయన్నపేట, మే 13న రాపల్లి, మే 14న బ్రాహ్మణపల్లి, మే 15న చిన్నబీరవల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు ఈసదస్సులో పాల్గొని తమ భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు సమర్పించాలని ఆయన తెలిపారు.

# ప్రతి రైతుకు గుర్తింపు కార్డు

**-11 అంకెలతో ప్రత్యేక నెంబర్ కేటాయింపు**
**-ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలించిన**
**జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కేంద్ర ప్రభుత్వ చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం క్లస్టర్‌లో ఫార్మర్ ఐడి రిజిస్ట్రీ కార్యక్రమంలో భాగంగా రైతు రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల యూనిక్ ఐడి కేటాయించడం జరుగుతుందన్నారు. వారికి ఉన్న భూమి రకం, సాగు, వ్యక్తిగత వివరాలను డిజిటల్ రూపంలో ప్రభుత్వం నమోదు చేస్తుందన్నారు. మే ఐదు నుంచి జూన్ ఐదు వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా వ్యవసాయ రంగంలో డిజిటల్ విప్లవం రానుందన్నారు. ఫార్మర్ ఐడి అనేది రైతులకు అందించే డిజిటల్ గుర్తింపు కార్డు అని దీనిని ఆధార్ కార్డుతో లింక్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ 11 అంకెల ఐడిలో రైతు పేరు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, పట్టాదారు పాసు పుస్తకం వివరాలు, భూమి రకం, సర్వేనెంబర్లు, సాగు చేసిన పంటలు పూర్తి సమాచారం నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఐడి ద్వారా రైతు వివరాలను ఒక క్లిక్‌తో తెలుసుకోవచ్చునని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డు, ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు ఈ ఐడి తప్పనిసరి కానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా పథకాలకు ఈ ఫార్మర్ ఐడి అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచించిందని ఆయన తెలిపారు. రైతులు విధిగా ఏఈవోల వద్దకు వచ్చి ఆధార్‌తో పాటు లింక్ అయిన ఫోన్ నెంబర్ వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని కోరారు. ఫార్మర్ ఐడిలో రైతు వివరాల నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో బాలాబత్తుల శిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

# రోగులకు పాలు, పండ్లు, బ్రేడ్ పంపిణీ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు జన్మదిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని ఆధ్వర్యంలో ప్రభుత్వ హస్పిటల్ లో నిర్వహించారు. సోమవారం స్థానిక హాస్పిటల్ లో రోగులకు పండ్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ లు వెంకన్న, రాయపూడి నవీన్, నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, బచ్చలకూరి నాగరాజు, లక్కం ఏడుకొండలు, గట్టికుండ్ల విజయ్, కడియా నరేష్, గొలుసు పవన్, మల్లయ్య, కొడిరెక్క వినోద్, అనంతు సత్యనారాయణ, ముక్కంటి, సాయినవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై గర్జించిన ఎర్ర దండు





**ప్రజాపక్షం/ములకలపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకాలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజా సమస్యలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో రేవతి, ఏఓ అరుణ్‌కుమార్‌లకు మెమోరాండం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రకు పూనుకున్నాదని అన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి మెచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ కాలువ పనులు పూర్తి చేసి ముందు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి సాగు భూములకు సాగు నీరు అందించిన తర్వాతనే ఇతర జిల్లాలకు సాగు నీరు తరలించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, పోడియం వెంకటేశ్వర్లు, గౌరీ నాగేశ్వరరావు, ఊకంటి రవికుమార్, మాలోతు రావుజ, నిమ్మల మధు, గొగ్గల ఆదినారాయణ, మంచాల సారయ్య, గోపగాని లక్ష్మి నరసయ్య, బైరు ప్రసాద్, వర్స శ్రీరాములు, కీసర వెంకట్రారావ్, సున్నం శ్రీను, పద్ధం తిరుపతమ్మ, బుగ్గ వెంకట్ నర్సమ్మ, దేవేందర్, రాఘవయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వేసవి శిక్షణ శిబిరం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థుల శారీరక మానసిక వికాసాన్ని మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలో ఈనెలలో ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి అన్నారు. మండలంలోని మిట్టగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ పాఠశాలలో ఈనెల 5వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఈ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఈ తరగతులను 6 నుండి 9 తరగతి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, వేసవి సెలవులకు పలు ప్రభుత్వ హాస్టల్స్ నుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులు మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు ఎవరైనా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుండి 11గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తామని ఇందులో విద్యార్థిని విద్యార్థులకు రెండు రోజులు ఇండోర్ గేమ్స్, రెండు రోజులు తోట పని విత్తనాల సేకరణ, రెండు రోజులు చిత్ర నైపుణ్యము, ఒక రోజు పేపర్ క్రాఫ్ట్, రెండు రోజులు వైజ్ఞానిక ప్రయోగాలు, రెండు రోజులు ఇష్టమైన క్రీడలు, మూడు రోజులు కంప్యూటర్ శిక్షణ, చివరి రోజు శిక్షణ తరగతులలో నైపుణ్యం చూపిన విద్యార్థులను ప్రోత్సహించడం బహుకరణ లాంటివి ఈ 15 రోజుల శిక్షణ తరగతులు జరుగుతాయని అన్నారు. ప్రతి రోజు 20 నిముషాలు యోగ, పది నిమిషాలు మానసిక ప్రశాంతత, ఒక గంట నీతి కథలు లాంటివి చేయిస్తామని ఈరోజు సుమారుగా 30 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు మీ పిల్లలను ఈ శిక్షణ తరగతులకు చేర్పించే విధంగా చూడగలరని ప్రతి రోజు తరగతి అనంతరం పిల్లలకు స్నాక్స్ ఇచ్చి ఇళ్ల పంపించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, పంచాయితీ సెక్రటరీ సైదులు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్టు



**ప్రజాపక్షం/ఇల్లెందు:** మండలంలోని కట్టుగూడెం పాత పెంకు ఫ్యాక్టరీలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడి చేసి అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో దాడి చేయగా పేకాడుతున్న ఎనిమిది మందిని అక్కడే అరెస్టు చేశామని ఒకరరు పరారీలో ఉన్నారని, వారి నుంచి రూ.40వేలు నగదు, 8సెల్‌ఫోన్లు, ఒక కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు 9మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, పేకాట ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మంత్రుల పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**






**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మంత్రుల పర్యటనలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లాకలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రఘునాథపాలెం బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రభుత్వ వైద్య కళాశాల శంకుస్థాపనకు రాష్ట్ర మంత్రులు విచ్చేస్తున్నారని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే రోజుల్లో మెడికల్ విద్యార్థుల అవసరాల దృష్ట్యా నూతన వైద్య కళాశాల భవన నిర్మాణం కోసం రఘునాథపాలెం బైపాస్ రోడ్డు వద్ద భవన నిర్మాణ పనులకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. మంత్రులతో శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభా స్థలి, సౌండ్ సిస్టం, సరిపడ కుర్చీలు, టెంటు, సభా వేదిక ప్రత్యేకంగా పరిశీలించి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంత్రుల పర్యటనలో నేపథ్యంలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రులు సందర్శిస్తారని ఆ తర్వాత మెడికల్ కళాశాల భవనాలకు శంకుస్థాపన చేసి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారం తో హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తనిఖీ చేశారు. ప్రధాన ఆసుపత్రుల్లోని క్యాజువాలిటీ, వెయిటింగ్ హాల్, ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్, దోబీ మిషనరీష్, ఎంపిహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ సెంటర్, మెడికల్ కళాశాల బాలుర వసతి గృహం, ఎంసిహెచ్, యునాని, ఆయుర్వేద వైద్యశాల, ఓపి, మార్చురి ప్రక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. దవాఖానాకు వచ్చే వాహనాల పార్కింగ్, ఆసుపత్రి ప్రధాన గేటు బయట వాహనాల రద్దీ నియంత్రణ తదితర విషయాలపై కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఆసుపత్రికి కావాల్సిన వైద్య పరికరాలు, సౌకర్యాలు, నిర్వహణ గురించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆసుపత్రి నిర్వహణ పక్కా ఉండాలన్నారు. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు వైద్యం నిమిత్తం ఏ విభాగం ఎక్కడ ఉంటుందో తెలిసేలా సూచికలు ప్రదర్శించాలన్నారు. మరుగుదొడ్ల మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజేశ్వరరావు, సహాయ కమిషనర్ షఫీవుల్లా, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం తరుగుతో రైతుల రాస్తారోకో

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పుల్లయ్య బంజరు ఐకెపి కొనుగోలు కేంద్రంలో గత కొద్ది రోజులుగా లారీలు రాక, గోని సంచులు లేక తూర్పార పట్టిన కూడా తరుగు మూడు కేజీలు తీస్తున్నారని అభ్యంతరంతో రైతులు ఆగ్రహాన్ని గురై ఐకెపి ఏపిఎంకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని, లెక్కలేని తనంగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని అతనిపై చర్య తీసుకోవాలని కోరుతూ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం సమయంలో రైతులు రోడ్డెక్కి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా గోన సంచులు కొరత లారీలు కొరత తూర్పార పట్టిన కూడా ధాన్యంలో మూడు కేజీలు తరుగు తీస్తూ రైతులను మిల్లర్లు దోపిడీ చేస్తున్న ఫిర్యాదు చేసినా కూడా ఐకెపి ఎపిఎం పట్టించుకోవడంలేదని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరు ఎస్ఐ హరిత ఏపిఎం రాంబాబు కు ఫోన్ చేసి



రాస్తారోకో వద్దకు రప్పించి సమాధానం చెప్పించారు. అయినా కూడా ఏపిఎం డౌన్ డౌన్ నిర్లక్ష్య వైఖరి నశించాలి అంటూ ఆగ్రహించిన రైతులు ఆగకుండా ఆర్డిఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకి, నరసింహారావు ,ఆనందు, శ్రీను, వీరయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.

# రైతు సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు సందర్శన

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు సేలం సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షులు కళ్యాణ్ కృష్ణయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు సరిగ్గా జరగటం లేదని, అకాల వర్షాలకు ధాన్యం తడిసి పాడైపోతుందని, గన్ని బ్యాగ్స్ కొరత ఉందని, లారీలు రావడం లేదని తదితర సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కువ రోజులు కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఉండటం వలన ఇతర వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నారని, తరుగు పేరుతో మిల్లర్లు ఒక్కో బస్తాకు రెండు మూడు కేజిలు ఇస్తే తీసుకుంటా



మని చెబుతున్నారని ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సివిల్ సప్లయి డిటి, తల్లాడ తహశీల్దార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా వెంటనే గన్ని బ్యాగ్స్ పంపిస్తామని, లారీలు ఈరోజే పంపిస్తామని, రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే మండల వ్యాప్తంగా రైతులను సమీకరించి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట రైతు సంఘం మండల నాయకులు ఐలూరి రామిరెడ్డి, కట్ట దరగయ్య, జనార్ధన్, కృష్ణారెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం

**ప్రజాపక్షం/ఇల్లెందు:** ఇల్లెందు ఆర్టీసీ డిపోలో సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవి సెలవుల నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఓ బస్సు కొత్తగూడెం నుంచి పాల్వంచ ద్వారా మణుగూరుకు, మరో బస్సు కొత్తగూడెం నుంచి సత్తుపల్లికి నడపనున్నట్లు తెలిపారు. అనంతరం కొంత దూరం బస్సులో ప్రయాణించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, డిపో కంట్రోలర్, ఆర్టీసీ సిబ్బంది,



పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏరియా సెక్యూరిటీ జిఎంకు ఎఐటియుసి వినతి

**ప్రజాపక్షం/ఇల్లెందు :** ఎఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందుకు విచ్చేసిన జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణ కార్పోరేట్‌ని ఎస్అండ్ పీసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా యూనియన్ బృంధం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.




అనంతరం ఎస్అండ్‌పీసీ ఎఐటీయూసీ పిట్ కార్యదర్శి దాట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ప్లెడ్ 1ను సవరించి అందరికీ ప్లెడ్‌లు వర్తింపజేయాలని, ప్రతీ కంప్యూటర్ తనిఖీ కేంద్రంలో ఏసీ సౌకర్యం కల్పించాలని, కోయగూడెం ఓసీ తనిఖీ కేంద్రం ఓవర్‌హెడ్ ట్యాంకు నీటి సరఫరా చేయాలని కోరారు. ఇనుప తనిఖీ కేంద్రం షెడ్‌ల స్థానంలో నూతన కాంక్రీట్ భవనం, ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో చల్లని మంచినీటిని ఉంచే విధంగా కూలర్ ఏర్పాటు చేయాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వేసవి కాలం పూర్తి అయ్యేంత వరకు డ్రిల్, పీటీలను రద్దు చేయాలని తదితర అంశాలపై నాయకులు వినతిపత్రం ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్ సహాయ కార్యదర్శి ఎస్.రవి, మహమ్మద్ నజీరుద్దీన్, సురేశ్, మురహరి పాల్గొన్నారు.

# పాకిస్తానీలను బహిష్కరించాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీలను బహిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ వెంకటేశ్వర్లు కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాకిస్తాన్ మద్దతు



ఆశ్రమం పొందిన ఉగ్రవాదులు కాశ్మీర్ లో పహాల్గామ్ లో క్రూరమైన దాడి కి పాల్పడి 26 మంది ప్రాణాలను తీశారని అన్నారు. ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులను ప్రోత్సాహించే సంస్థలు లేదా దేశాలను బహిష్కరించాలని కోరారు. వెంటనే పాకిస్తానీలను పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, దుర్గారావు, ఎలిగేటి నరసింహారావు, తొగాటి నాగచారి, కళ్యాణం నాగేశ్వరరావు, నాగసాయి. వెంకటేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# 112 కిలోల గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/ఇల్లెందు:** మండల పరిధి లోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో పక్కా సమాచారం మేరకు ఎస్సై పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 112కిలోల గంజాయిని పట్టుకున్నట్లు డీఎస్పీ చంద్రభాను పేర్కొన్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో కొత్తగూడెం నుంచి ఇల్లెందు వైపుగా జహీరాబాద్‌కు బజాజ్ ఆటో నం.



ఎపీ20వై4542 వాహనంలో తరలిస్తున్న 112కిలోల గంజాయి సుమారు రూ.56లక్షలు ఉంటుందని, దానితోపాటు పల్సర్ ద్విచక్రవాహనం నం.టీఎస్26ఎఫ్1896ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, ఏ1గా సపావట్ వెంకన్న, ఏ2గా మూడ్ శ్రీనివాసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** రైతులు యూరియా, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి పంటల మార్పిడితో అధిక దిగుమతులు సాధించవచ్చునని మధిర వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రుక్మిణిదేవి తెలిపారు. మండల పరిధిలోని ఖమ్మంపాడు రైతువేదికలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రసాయనాలు



తగ్గించి పంట మార్పిడి చేయటం ద్వారా పంటలకు వచ్చే చీడపీడలు తగ్గించుకోవచ్చునని, రైతులు పంట మొదలు పెట్టిన దగ్గర నుంచి పంట కోసే వరకు ఉన్న రసీదులను భద్రపర్చుకోవాలని తెలిపారు. అంతర్ పంటలకు వాడడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ఎఓ సాయిదీక్షిత్ మాట్లాడుతూ పచ్చిరొట్టెలు వేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలు, వేసవిలో దుక్కి దున్నకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అదేవిధంగా వచ్చే వానకాలంలో విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని, పత్తి విత్తనాలు మొదటి వర్షానికి కాకుండా నేల పూర్తిగా తడిచి మొలకెత్తే తేమ ఉన్నప్పుడు మాత్రమే పత్తి విత్తనాలు విత్తుకోవాలని తెలిపారు. ఫార్మ్ రిజిస్ట్రి రైతు నమోదు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎఈఓ సుష్మ, ఖమ్మంపాడు రైతులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో వినతి

**ప్రజాపక్షం/ తల్లాడ :** రాష్ట్ర, జిల్లా బిజెపి పార్టీ ఆదేశాల మేరకు బిజెపి ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్, టౌన్ ఎస్సైకు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నివాసముంటున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన రోహింగ్యాలను దేశ భద్రత దృష్ట్యా వారిని తక్షణమే దేశం విడిచి వెళ్లలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాయల రమేష్, గొల్లమందల నరేష్, సంగీతం సాయిచంద్, చల్లా రాము, పులి వెంకటేశ్వర్లు, రామారావు, మలేడు వెంకటయ్య, వేము అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ గతిని మార్చిన మార్క్సిజం

**-దోపిడీలేని సమాజ రూపశిల్పి కారల్ మార్క్స్ : బాగం**
**-207వ జయంతి సందర్భంగా ఘన నివాళి**




**ప్రజాపక్షం/ఖమ్మం :** కారల్ మార్క్స్ ప్రతిపాదించిన మార్క్సిజం ప్రపంచ గతిని మార్చిందని ఇప్పుడు ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం మార్క్సిజమేనని పెట్టుబడిదారి సమాజం సైతం అంగీకరిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సమ సమాజం కోసం పరితపించిన కారల్ మార్క్స్ దోపిడీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేశారని ఆయన తెలిపారు. కారల్ మార్క్స్ 207వ జయంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో కారల్ మార్క్స్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ మానవ శ్రమకు విలువ తెచ్చిన మహనీయుడు కారల్ మార్క్స్ అని ఆయన తెలిపారు. శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని ఆయన చేసిన కృషి ప్రపంచ కార్మిక వర్గానికి ఒక దిక్సూచిగా మారిందన్నారు. పెట్టుబడిదారి సమాజ లక్షణాలను 150 ఏళ్ల క్రితమే తెలిపిన కారల్ మార్క్స్ దాని పతన లక్షణాలను సైతం వివరించారన్నారు. ఆర్థిక సంక్షోభంలో పెట్టుబడిదారి సమాజం కూరుకుపోతుందని, అవినీతి పెరిగిపోతుందని తద్వారా ఆ సమాజం కూలిపోతుందని కారల్ మార్క్స్ చెప్పారని పెట్టుబడిదారి సమాజంలో ఇప్పుడు ఆ లక్షణాలు కనిపిస్తున్నాయని హేమంతరావు తెలిపారు. ప్రస్తుతం ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని ప్రస్తుతం మళ్లీ శ్రమ దోపిడీ పెరిగిపోతుందని ఆయన తెలిపారు. ప్రపంచ మానవాళి కోసం దోపిడీ లేని సమ సమాజం కోసం కారల్ మార్క్స్ కలలు కన్నారని ఆ కలలను నిజం చేసేందుకు సమరశీల పోరాటాలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. శతాబ్దాలు గడిచిన మొక్కవోని మార్క్సిజం కోసం ఎర్రజెండా నీడలో సిపిఐ నేతృత్వాన బహుముఖ పోరాటాలను కొనసాగించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహా రావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, నాన బాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, రాసాల మోహన్‌రావు, జిల్లా నాయకులు పోటు పూర్ణచందర్‌రావు, మందా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కాంపల్లి బాలుకు గద్దర్ ఐకాన్ అవార్డు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాకు చెందిన ప్రజా కళాకారుడు కాంపల్లి బాలుకు అలేఖ్య సంస్కృతిక సేవా సంస్థ గద్దర్ ఐకాన్ అవార్డును బహూకరించింది. ఖమ్మంజిల్లా తల్లాడ మడలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాంపల్లి బాలు కవిగా, గాయకునిగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. రాష్ట్ర నలుమూలల ఆయన పాటల ప్రదర్శనలు కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్నాటక, ఢిల్లీ, ముంబాయి లో కూడా అనేక ప్రదర్శనలు తన బృందంతో కలిసి ఇచ్చారు. సోమవారం రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సంసృతిక సారధి ఛైర్మన్ వెన్నెల చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు.ఈ కార్యక్రమంలో విమలక్క, వేణుగోపాలచారి, అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలును పలువురు అభినందించారు.

# విద్యుత్ షాక్‌తో కోడెగిత్త మృతి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో విద్యుత్ నియంత్రిక వద్ద రక్షణ లేకపోవడం వలన మేత, తాగునీటికి వచ్చిన కోడెగిత్త ఎర్త్ వైర్ కి తాకి మృతి చెందినట్లు రైతు తిరుమల శెట్టి సీతయ్య తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఉపయోగపడే ఈ గిత్త మృతితో రైతు లబోదిపోమంటూ దుఃఖిస్తున్నాడు. ఈ విషయమై కల్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. పశువైద్యాధికారికి సమాచారం అందిందని పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కోడే గిత్త విలువ సుమారు రూ. 70,000 వరకు ఉంటుందని రైతు వాపోయాడు.

# సహజ సిద్ధమైన మామిడి పండ్లను విక్రయించాలి

**-మామిడి పండ్ల స్టాల్‌ను సందర్శించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతులు, వినియోగదారులు మామిడి పండ్ల మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం నగరంలోని పెవిలియన్ మైదానంలో కార్బైడ్ రహిత మామిడి పండ్ల మేళా స్టాల్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. స్టాల్‌లో ఉంచిన పలు రకాల మామిడి పండ్లను పరిశీలించారు. స్టాల్ నిర్వాహకులు బానోత్ లక్ష్మణ్ నాయక్ తో కలెక్టర్ ముచ్చటించారు. గత 13 ఏళ్లుగా మామిడి పండ్లను నేరుగా అమ్ముతున్నానని ముందుగా ఒకడిగా మొదలు పెట్టిన నేను 10 మందికి పని కల్పించి వ్యాపారం చేస్తున్నానని తెలిపారు. ప్రజల నమ్మకంతో కార్బైడ్ రహిత పండ్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పలు రకాల మామిడి పండ్లను విక్రయించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ చొరవతో ప్రత్యేకంగా రోటరీనగర్‌లో మామిడి పండ్ల మార్కెట్ రావడంతో అక్కడ కూడా ఒక స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరం రోటరీనగర్‌లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో 30కు పైగా స్టాళ్లతో మామిడి పండ్ల మార్కెట్‌ను నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. స్టాల్‌లలో రైతులు పండ్ల విక్రయం చేపట్టారని తెలిపారు. ఖమ్మం పరిసర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మామిడి రైతులు ఇక్కడకు వచ్చి పండ్లు విక్రయించుకుంటారని కలెక్టర్ తెలిపారు. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేవిధంగా మార్కెట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. దళారులు లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మామిడి పండ్ల మార్కెట్ మాత్రమే కాకుండా మామిడి సీజన్ ముగిసిన తర్వాత వివిధ సీజన్లలో వచ్చే ప్రత్యేకమైన పండ్లు జామ, సీతాఫలం, బొప్పాయి వంటి వాటిని రైతులు నేరుగా వచ్చి ఇక్కడ విక్రయించేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంవి మధుసూదన్, హార్టికల్చర్ అధికారిణి అనితశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కోసం మహిళలు ధర్నా



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని చిన్న కోరుకొండి గ్రామానికి చెందిన మహిళలు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని అర్హత కలిగి ఉన్నా కూడా మాకు గృహాలు మంజూరు జాబితాలో లేదని అనర్హులను ఇందిరమ్మ కమిటీ వారు ఎంపిక చేసి జాబితాలో ఉంచారని అర్హులైన పేదలమైన మేము తమను గుర్తించి ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసి ఆదుకోవాలని తహశీల్దార్ పులి సాంబశివుడుకు వినతి పత్రం ఇచ్చారు. ఇందిరమ్మ కమిటీ వారు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తూ అనర్హుల జాబితాను తప్పులు తడకలతో ఎంపిక చేసి అధికారులకు పంపించారని క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ చిన్న కోరు కొండి మహిళలు తహశీల్దార్ కు మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు జంపాల కృష్ణకుమారి, జిల్లెల్లనాగమణి, అందుబాయి, జిల్లెల్ల జ్యోతి, వెంకటమ్మ, రాములమ్మ, రెడ్డి కృష్ణవేణి, కుప్పాల సత్యవతి లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# గన్నీ సంచులు సరఫరా చేయాలని వినతి



**ప్రజాపక్షం/వైరాః** రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచులు లారీలు సకాలంలో సరఫరా చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం వైరా తహశీల్దార్ కెవి.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ వైరా మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన గన్ని సంచులు సకాలంలో అందించాలని, కాటా వేసిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్‌కి లారీలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. మిల్లర్లు కొనుగోలు కేంద్రాల్లో తిరిగి తమకు నచ్చిన ధాన్యం, ఎక్కువ తరుగు పేరుతో కట్టింగ్‌కు అంగీకారం తెలిపిన రైతుల ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. మరోవైపు అకాల వర్షాలతో ధాన్యం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా అధికారులు దృష్టి సారించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు సమస్యలు పరిష్కారం చేయాలని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, అమరనేని కృష్ణ, గుమ్మా నర్సింహారావు, రాజేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సహచరుడికి బాసటగా నిలిచిన పూర్వ విద్యార్థులు



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలం రెబ్బవరం జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి 1989 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, శస్త్ర చికిత్స చేయించుకున్న తమ సహచరుడు నోముల రవికుమార్‌కు రూ.55వేలు చెక్ అందించి బాసటగా నిలిచారు. వృత్తి రీత్యా కృష్ణా జిల్లా నందిగామలో స్థిరపడ్డ రవికుమార్ కుడి చేయి గత ఏడాది గానుగ మిల్లులో పడి, చేతి ఎముక నాలుగు చోట్ల విరగడంతో పాటు, చేతి నరాలు సైతం దెబ్బతిన్నాయి. ఈ నేపద్యంలో అతనికి మళ్లీ శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. ఇటీవల అతని కుడిచేతి నరాలకు గాను ఏపి రాష్ట్ర రాజధాని అమరావతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిర్వహించారు. అందుకు గాను పెద్ద మొత్తంలోనే ఖర్చు అయింది. శస్త్ర చికిత్స చేయించుకొని కష్టాల్లో ఉన్న తమ సహచరుడికి, కొంతైనా ఆర్థిక చేయూత అందించాలనే సంకల్పంతో పదో తరగతి పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.55వేలు సమకూర్చారు. అట్టి మొత్తానికి సంబంధించిన చెక్‌ను సోమవారం వైరా పట్టణంలో బాధితుడు రవికుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా చిన్ననాటి మిత్రులు బాధితుడి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని తామున్నామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలబోయిన నర్సింహారావు, సీనియర్ పాత్రికేయులు షేక్ ఇబ్రహీం, కస్తాల వినోదలక్ష్మి, బండారు జ్యోతి, మేడగాని కిరణ్‌కుమార్, పల్లపోతు రవికుమార్, కేసా వెంకట గురునాథం తదితరులు పాల్గొన్నారు.

# వైరా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాలు



**ప్రజాపక్షం/వైరాః** టిజిఎన్‌పిడిసిఎల్ కంపెనీ ఆదేశానుసారం వైరా సబ్ డివిజన్ స్థాయిలో వైరాలోని రైతువేదిక దగ్గర ఏడిఈ పి.కిరణ్‌కుమార్ అధ్యక్షతన భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డిఈఈ బండి శ్రీనివాసరావు విద్యుత్ భద్రతా వారరోత్సవాల ప్రాముఖ్యతను విద్యుత్ సిబ్బందికి తగు సూచనలు సలహాలను తెలియజేస్తూ విద్యుత్ సరఫరాలో లోపాలు తలెత్తినప్పుడు నూతన విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసేటప్పుడు, ఇతర విద్యుత్ మరమ్మత్తులు నిర్వర్తిస్తున్నప్పుడు విద్యుత్‌శాఖ సిబ్బంది శాఖపరంగా సూచించిన అన్ని భద్రత ఉపకరణాలు కచ్చితంగా ఉపయోగించి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విధులు నిర్వహించాల్సిందిగా కోరారు. అదేవిధంగా వినియోగదారులు విద్యుత్ వాడకంలో ప్రమాదాలకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించే విధంగా సూచనలు సలహాలను వైరా సబ్ డివిజన్ విద్యుత్‌శాఖ సిబ్బందికి, డిఈఈ బండి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఏఈ పచ్చిగళ్ళ సుందర్‌కుమార్, వైరా రూరల్ విద్యుత్‌శాఖ ఏఈ వెంకటసాయి, బోనకల్ విద్యుత్‌శాఖ ఏఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ యూనిఫాం సకాలంలో అందజేయాలి



**ప్రజాపక్షం/చింతకాని :** పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు యూనిఫాం అందజేయాలని ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో లక్ష్మీ దేవి గ్రామసమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ తయారు చేస్తున్న సెంటర్ ను తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెస్‌లు నాణ్యతగా కుట్టాలని, కొలతలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. తయారు చేసిన దుస్తులను ఎప్పటి కప్పుడు పాఠశాలలకు తరలించాలని ఐకేపి సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో రామారావు, ఏపీఎం బొమ్మా శ్రీనివాసరావు, సీసీ భాస్కర్, వీవోఏ రాధామణి తదితరులు పాల్గొన్నారు.